క్లుప్తంగా

రైతుసంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సబ్‌కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, తెనాలి డివిజన్ కమిటీ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రైతాంగానికి ఉపయోగపడేలా క్యాలెండర్‌ను తీసుకొచ్చిన కమిటీని అభినందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ మాటాలడుతూ గతంలో గ్రామంలో కరణం, గ్రామ మోతుబరి దగ్గరే క్యాలెండర్ ఉండేదని, తిథి, వార, నక్షత్రాలతోపాటు వ్యవసాయ సంబంధమైన విషయాలను వారి ద్వారా తెలుసుకునే ఆనవాయితీ ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతాంగానికి ఉపయోగపడేలా క్యాలెండరును తీసుకురావటం సంతోషంగా ఉందన్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ 2025 సంవత్సరం రైతాంగానికి మేలు జరగాలని ఆకాంక్షించారు. మేకల చిట్టిబాబు, పసుపులేటి శివనాగేశ్వరరావు, ములకా శివకుమారి, షేక్ హుస్సేన్‌వలి, కేవీ సత్యనారాయణ, ఎస్.రాజ్యలక్ష్మి, భీమవరపు చినరామిరెడ్డి, మాగంటి యల్లమందయ్య, తాటి వెంకటేశ్వర్లు, ఆరికా ప్రసాద్, జి.వెంకట సుబ్బయ్య, అనిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓంకారాశ్రమానికి ఆధ్యాత్మిక శోభ

ఓ చక్కని సంకల్పంతో ఏర్పాటైన ఓంకారాశ్రమం నాడు నిర్లక్ష్యానికి గురై.. ఆలనా-పాలనా కరువై.. ఆఖరున అన్యాక్రాంతమైపోయింది. ఇది గమనించిన జగనన్న ప్రభుత్వం ఈ ఆశ్రమానికి పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు నడుంబిగించింది. అప్పటి ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరు కావడం.. చకచకా పనులు ఆరంభమై నేడు చక్కని ఓ ఆలయం కూడా రూపుదాల్చింది. మొత్తం మీద ఈ ఆశ్రమం కొద్దిరోజుల్లో భక్తులకు అందుబాటులోకి రానుంది.

- పూర్తయిన ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణం
- ప్రస్తుతం ఉపాలయ నిర్మాణం పనులు
- అతీగతీ లేని ఆశ్రమం ఇకపై పవిత్ర క్షేత్రం



ఓంకారాశ్రమం



ఆశ్రమంలో నిర్మించిన ఓంకారేశ్వరస్వామి ఆలయం



నిర్మాణంలో ఉన్న ఉపాలయం

తెనాలి: పూర్వులు సదాశయంతో నిర్మించిన ఆశ్రమాలు కాలక్రమంలో అన్యాక్రాంతం కావటం, ఆలనా పాలనా లేని స్థితికి చేరుకుంటున్న దాఖలాలెన్నో! తెనాలిలోని ఓంకారాశ్రమం కూడా అలాంటిదే. తొమ్మిది దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన ఈ ఆశ్రమం కాలక్రమంలో నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. రూ.కోట్ల విలువైన ఆస్తులున్నా, స్వార్థపరుల ఇష్టారాజ్యంగా అతీగతీ లేని చందంగా కునారిల్లుతోంది. ఆశ్రమ స్థలాన్ని పవిత్ర సందర్శనీయ స్థలంగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వ హయాంలో దేవదాయశాఖ సంకల్పించింది. అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవతో నిధులు మంజూరయ్యాయి. ఫలితంగా అక్కడ పవిత్రమైన ఆలయం వెలసింది.

పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని ఓంకారాశ్రమం 1932లో ప్రారంభమైంది. కాకుమాను శ్రీరాములు అనే ఆధ్యాత్మిక చింతనాపరుడు ఆశ్రమాన్ని స్థాపించారు. సాధువులు ధ్యానం చేసుకునేందుకు, వారి పోషణ కోసమనే భావనతో ఏర్పాటైన ఆశ్రమానికి అప్పట్లో శ్రీవ్యాస ఆశ్రమ నిర్వాహకుడు మలయాళ స్వామి శంకుస్థాపన చేశారు. ఆశ్రమం తరపున పేదలకు వైద్యం, విద్యార్థులకు విద్య అందించాలని దాతలు 12.83 ఎకరాల మాగాణి భూమిని సమకూర్చారు. దాతల లక్ష్యం నిర్విఘ్నంగా నెరవేరింది. యజ్ఞయాగాది క్రతువులు వైభవంగా జరిగాయి. అప్పట్లో ఆశ్రమానికి స్వామీజీలు ట్రస్టీలుగా ఉండేవారు. 1947-1963 మధ్య ఆశ్రమానికి గల మాగాణి భూమిని విక్రయించారు. ఆ డబ్బుతో గంగానమ్మపేటలో గల శ్రీవేణుగోపాలస్వామి గుడి వీధిలో రెండు ఇళ్లు, చెంచుపేటలోని ఒక గోడౌనును కొనుగోలు చేశారు.

మలయాళస్వామి మరణంతో ఆశ్రమ ట్రస్టీల వ్యవహారంలో వివాదాలు మొదలయ్యాయి. 1980 వరకు పరంపరగా సాగాయి. అనంతరం ట్రస్టీలు ఏర్పాటైనా 1996లో ఆశ్రమ నిర్వహణ దేవదాయ, ధర్మదాయశాఖ పరిధిలోకి వెళ్లింది. అప్పటి నుంచి అభివృద్ధి శూన్యమైంది. పైగా 1983లో ఆశ్రమంలో గల ధ్యానమందిరాన్ని కూల్చారు. భవనానికి ఉన్న విలువైన టేకు కలపను విక్రయించారని ఆరోపణలున్నాయి. 1998లో ఆశ్రమ స్థలంలోని 80 సెంట్ల స్థలాన్ని ఓ ప్రైవేటు విద్యాసంస్థకు లీజుకిచ్చారు. అయిదేళ్ల కాలానికి అద్దె మొత్తాన్ని ఏకమొత్తంగా వసూలు చేశారని చెబుతారు. ఆ విద్యాసంస్థ లీజుగా పొందిన స్థలంలో శాశ్వత కట్టడాలకు ప్రయత్నించటంతో వారసులు కోర్టులో దావా వేశారు. కోర్టు ఆదేశాలతో నిర్మాణ పనులు ఆరంభించలేదు. బుర్రిపాలెంరోడ్డులోని ఆశ్రమానికి 514/1 సర్వేనంబరులో 1.28 ఎకరాలు, 514/2లో 60 సెంట్ల స్థలం పక్కపక్కనే ఉన్నాయి. కేవలం 80 సెంట్ల స్థలాన్ని లీజుకు తీసుకున్న సంస్థ మొత్తం స్థలంలోకి ఎవరూ ప్రవేశించరాదనే హెచ్చరిక బోర్డును గేటు ఎదుట ఉంచటం వివాదమైంది. కోర్టు వివాదంతో ప్రైవేటు విద్యాసంస్థకు లీజు ఆగిపోయింది.

శ్రీవేణుగోపాలస్వామి గుడి వీధిలోని భవనాన్ని గతంలో కొంతకాలం లాడ్జికి అద్దెకిచ్చారు. కొన్ని నెలలు రిక్రియేషను క్లబ్ కూడా నడిచింది. దేవదాయశాఖ చర్యలతో ఇంటికి నెలకు రూ.16.020, పక్కనే గల మరో ఇంటికి రూ.10 వేలు చొప్పున అద్దె లభిస్తోంది. గొడౌనుకు రూ.17,600 అద్దెతో ఏడాదికి రూ.5.23 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. ఆశ్రమం వెనుకభాగంలోని మందిరంలో గల మలయాళస్వామి విగ్రహానికి చైత్రశుద్ధ ఏకాదశి రోజున జయంతి ఉత్సవాలు, వ్యవస్థాపకుడు శ్రీరాములుకు ఆరాధనలూ జరుగుతున్న దాఖలాల్లేవు. సువిశాలమైన ఆశ్రమ స్థలం అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైంది. ప్రహరీ లేకపోవటం, మరుగుగా ఉండటంతో రాత్రిళ్ల ఆకతాయిలకు ఆవాసమైంది.

ఓంకారాశ్రమం కార్యనిర్వహణాధికారిగా 2022లో బాధ్యతలు చేపట్టిన అవుతు శ్రీనివాసరెడ్డి ఆశ్రమ ప్రక్షాళనకు చర్యలు చేపట్టారు. శ్రీవేణుగోపాలస్వామి ఆలయం వీధిలోని ఇంటికి, చెంచుపేటలోని గొడౌనుకు వేలం ఆదాయం పెంచేలా చూశారు. ప్రస్తుతం రెండింటికి కలిపి నెలకు రూ.60 వేల వంతున ఏడాదికి రూ.7 లక్షలకు పైగా ఆదాయం లభిస్తోంది.

ఆశ్రమం ముందు ఆక్రమణలను, లోపల శిథిలమైన కట్టడాలను తొలగింపజేశారు. 1.40 ఎకరాల ఆశ్రమం ఎదుట ఆలయం నిర్మాణానికి పండిత మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద్‌చే 2023 డిసెంబరులో శంకుస్థాపన చేశారు. రూ.40 లక్షల వ్యయం కాగల ఆలయానికి దేవదాయశాఖ రూ.26.66 లక్షలు, ఆశ్రమ నిధులు రూ.13.34 లక్షలు వ్యయంతో నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం ప్రధానమైన ఓంకారేశ్వరస్వామి దేవాలయం నిర్మాణం పూర్తయింది. ఆ పక్కనే మళయాళ స్వామిల విగ్రహ ప్రతిష్ట నిమిత్తం ఉపాలయం నిర్మాణం పనులు జరుగుతున్నాయి. చెరుకుపల్లిలో ధ్వజస్తంభం రూపుదిద్దుకుంటోంది. అతి త్వరలోనే ప్రతిష్ట చేసేందుకు సన్నాహాల్లో ఉన్నారు.

నిత్యపూజలకు నిలయంగా



ఆశ్రమ స్థలంలో స్వామి దేవాలయ నిర్మాణం పూర్తయింది. నిత్యపూజలతో పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం. ఉపాలయం నిర్మాణం పూర్తవగానే ఒకటి, రెండు నెలల్లోనే ప్రతిష్ట చేసేలా కార్యాచరణలో ఉన్నాం. తూర్పువైపు కొంత స్థలాన్ని రోడ్డుకు వదిలి, మిగిలిన స్థలాన్ని ఆదాయం వచ్చే పనులకు ఉపయోగించాలన్న ఆలోచనలో ఉన్నాం.

– అవుతు శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వహణాధికారి

నూతన సంవత్సరానికి ఘన స్వాగతం

- వైఎస్సార్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..
- పార్టీ నేతల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్
- కూటమి ప్రభుత్వం కొత్త ఏడాదిలోనైనా సంక్షేమం అందించాలని ఆకాంక్ష



పార్టీ నేతలతో కలిసి కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ యువసేన నిర్వహణలో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రాంగణంలో వేడుకలు జరిగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పలువురు మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌ను కలిసి శుభాకాంక్షలను తెలియజేశారు. అందరి సమక్షంలో నూతన సంవత్సర కేక్‌ను శివకుమార్, పార్టీ నాయకులతో కలిసి కట్‌చేశారు. నియోజవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అందరూ సంతోషంగా ఉండాలని ఆయన కోరుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయిందని, నూతన సంవత్సరంలో అయినా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.

నూతన సంవత్సర వేడుకల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, కౌన్సిలర్లు గౌడవర్తి సాయిహరేరామ్, గెడ్డటి సురేంద్ర, యాతాటి అనిల్, కుర్రా సుజాత, కొర్ర యశోద, పెదలంక లక్ష్మీలావణ్య, కఠారి హరీష్, మల్లెబోయిన రాము, కో-ఆప్షన్ సభ్యులు పెచ్చింగ్ సుభాని, గొరిగపూడి నిర్మల, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, బండ్లమూడి నాని, గోల్డ్ రహిమా, తాడిబోయిన రమేష్, గొర్రెపాటి వేణుగోపాల్‌రెడ్డి, శానంపూడి రఘురామిరెడ్డి, కల్లం వెంకటప్పారెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, మన్నవ ప్రభాకర్, పిల్లి గంగాధర్, కనపర్తి అనిల్, బేతాళ భూషణం, పినపాటి అనిల్, యండ్రపాటి స్టాలిన్, కొడాలి క్రాంతి, కాళిదాసు సత్యం, ప్రసాదం సురేష్, పోతావఝుల పురుషోత్తమశర్మ, ఈద్‌గా గౌస్, షేక్ మీరావలి, కావటి నిర్మల, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, కుర్రా యశ్వంత్, అక్కిదాసు కిరణ్‌కుమార్, పార్టీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. తొలుత జయప్రకాష్‌నగర్‌లోని తన తండ్రి, మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ సమాధి వద్ద శివకుమార్ పుష్పాంజలి ఘటించారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

తెనాలిరూరల్: 2024కు వీడ్కోలు పలుకుతూ ప్రజలు కొత్త సంవత్సరానికి ఆనందోత్సాహాలతో స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం నుంచి నూతన సంవత్సర వేడుకలకు సిద్ధపడ్డారు. వాడవాడలా పండుగ వాతావరణం నెలకొంది. క్రైస్తవులు భక్తి ప్రపత్తులతో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. అన్ని చర్చిలలో మంగళవారం రాత్రి వాచ్ నైట్ ఆరాధన నిర్వహించారు. తిరిగి బుధవారం ఉదయం నూతన సంవత్సర ప్రత్యేక ఆరాధన ఏర్పాటు చేశారు. పట్టణంలోని టౌన్ చర్చి, సాల్వేషన్ ఆర్మీ, ఐతానగర్, చినరావూరు లూథరన్, ఆర్‌సీఎం, ఐతానగర్, మల్లెపాడు ఏబీఎం చర్చిలలో ఆయా సంఘ కాపారులు నూతన సంవత్సర వర్తమానాలు అందించారు. మారిస్‌పేటలోని రాక్ గాస్పెల్ చర్చిలో సంఘకాపరి బిషప్ పినపాటి జాన్‌పాల్ వాక్యోపదేశం చేశారు. ప్రత్యేక ఆరాధనలో సంఘస్తులకు ప్రార్థనాశీర్వాదాలను అందించారు. మంగళవారం రాత్రి నిర్వహించిన వాచ్‌నైట్ సర్వీస్ సందర్భంగా బిషప్ జాన్‌పాల్ సుధారాణి దంపతులను సంఘ పెద్దలు సత్కరించారు. పినపాటి రాజశేఖర్, ఆరె దానియేలు, ఈవూరి శ్రీనివాసరావు, కె.భాస్కరరావు, జయరాజ్, కఠెవరపు ఏసుదాస్, ఏసురత్నం, పినపాటి రత్నకుమారి, హెప్సిబ, ప్రభావతి పాల్గొన్నారు.



బిషప్ పినపాటి జాన్‌పాల్ దంపతులను సత్కరిస్తున్న రాక్ గాస్పెల్ చర్చి సంఘ పెద్దలు

కొలకలూరులో ..

తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు గ్రామ బీసీ కాలనీలో గల బేతేలు ప్రార్థనామందిరంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి సోపాటి యెహోషువ వాక్యోపదేశం చేశారు. పాత్రికేయుడు నూతక్కి అచ్యుతాచారి, అవినాష్, స్వరాజ్ వర్మ, సంధ్య, కమాధుల ఆనందరాజు, పేతురు, సీమోను, కార్తీక్ పాల్గొన్నారు. పాస్టర్ యెహోషువ, మనోహరమ్మ దంపతులను సంఘస్తులు సత్కరించారు.

అరవింద విద్యా కేంద్రంలో

తెనాలి: శ్రీఅరవింద విద్యాకేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత సామూహిక ధ్యానంతో వేడుకలను ఆరంభించాయి. విద్యార్థులకు మార్చ్‌ఫాస్ట్ తదుపరి ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకుడు సింహగౌరదాస్ శ్రీమాత పతాకాన్ని ఆవిష్కరించారు. కంకిపాటి రమేష్ జ్యోతిప్రజ్వలన చేశారు. శ్రీఅరవింద ఆశ్రమం నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు. సభకు విద్యాకేంద్రం డైరెక్టర్ కె.సంపూర్ణ అధ్యక్షత వహించారు. శ్రీమాతారవిందులు సమస్త మానవాళికి మార్గదర్శకులుగా అందించిన పూర్ణయోగం గురించి వివరించారు. కార్యదర్శి యడ్ల మోహనరావు, ప్రధానోపాధ్యాయిని ఆర్.నిర్మలకుమారి, యు.నాగమల్లేశ్వరి, ఎస్.నాగమణి, వై.పద్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఛైర్‌పర్సన్ ఆధ్వర్యంలో..

తెనాలి: మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక నివాస ప్రాంగణంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, ఇతర విభాగాలకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది ఛైర్‌పర్సన్ రాధికను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తన సారథ్యంలో పట్టణ ప్రగతి శరవేగంగా జరగాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, పలువురు పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. అందరి సమక్షంలో కేక్ కట్‌చేసిన రాధిక, నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో...

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యురాలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమకు నియోజకవర్గానికి చెందిన పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ గోగినేని, డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గుమ్మడి రమేష్, వుయ్యూరు రాజశేఖరరెడ్డి, నేలటూరి బెన్ను, సాంబశివరావు, ఆలపాటి వెంకట్రామయ్య, తాడిబోయిన శ్రీనివాసరావు, దేవినేని రమాదేవి, వాసిరెడ్డి సులోచన, వెంకటరమణ, ఈదర పూర్ణచంద్, అయినంపూడి సుబ్బారావు, సీహెచ్ సునీల్ తదితరుల పాల్గొన్నారు.



ధ్యానమందిరంలో వేడుకలు నిర్వహించిన అతిథులు, నిర్వాహకులు



కేక్ కట్‌చేసిన ఛైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ బండి శేషన్న



కేక్ కట్‌చేసిన డాక్టర్ ఉమ, డాక్టర్ లక్ష్మీప్రసాద్

పారదర్శకంగా తెనాలి ప్రాంత అభివృద్ధి



మంత్రి మనోహర్‌కు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



మంత్రి మనోహర్‌కు మొక్కను అందజేస్తున్న జేసీ భార్గవతేజ

నూతన సంవత్సర వేడుకల్లో మంత్రి మనోహర్

తెనాలిరూరల్: నూతన సంవత్సరంలో తెనాలి ప్రాంతాన్ని పారదర్శకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల, పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక బోస్‌రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, జిల్లా ఎస్పీ ఎస్.సతీస్‌కుమార్, వివిధ శాఖల అధికారులు మంత్రిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విజయవాడ, గుంటూరు నగరాలకు ధీటుగా తెనాలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లే విధంగా కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు.

హ్యాపీ న్యూఇయర్ మేడమ్



కార్యాలయ అధికారులు, సిబ్బందితో సబ్‌కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: నూతన సంవత్సరం డివిజనులోని ప్రజలంతా సుఖశాంతులతో హాయిగా జీవించాలన్న ఆకాంక్షను తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ వ్యక్తంచేశారు. 2025 సంవత్సరం తొలిరోజున డివిజనులోని పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బందితోపాటు వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, స్థానికులు సబ్‌కలెక్టర్‌ను కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. వీరిలో తెనాలి తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, దుగ్గిరాల తహసీల్దారు సునీత, కొల్లిపర తహసీల్దారు సిద్ధార్థ, కాకుమాను తహసీల్దారు వెంకటస్వామి, పొన్నూరు తహసీల్దారు జియావుల్‌హక్, సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీధర్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్మయి, పద్మ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సీఈపీఓ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఉన్నారు.

నేడు గ్రామ సభలు

కొల్లిపర: మండల పరిధిలో వివిధ గ్రామాలలో గురువారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీఈవో వి.విజయలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నేడు అన్నవరం, అన్నవరపు లంక, అత్తోట, చివలూరు, దావులూరు, కొల్లిపర, మున్నంగి, శిరిపురం, తూములూరు ఆయా గ్రామాల్లో సచివాలయం, పంచాయతీ కార్యాలయంలో, 3వ తారీకున చెముడుపాడు, చక్రాయపాలెం, బొమ్మువానిపాలెంలో ఆయా గ్రామాలలో సచివాలయంవద్ద, 4వ తారీకున అత్తలూరివారిపాలెం, దావులూరిపాలెం, హనుమాన్‌పాలెం, పిడపర్తిపాలెం, వల్లభాపురం ఆయా గ్రామాలల్లో గ్రామ సచివాలయం, పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సచివాలయం సిబ్బందితో మాట్లాడుతూ మండలంలో గత కొన్ని రోజుల నుంచి జరుగుతున్న షెడ్యూల్ కులాల సర్వే, సోషల్ అడిట్ మరియు ఎస్సీ కులాల వారి వివరాల ప్రజల సామాజిక తనిఖీ కోసం గ్రామ సచివాలయంలో సిబ్బంది జాబితా ప్రదర్శించి జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ప్రజల నుంచి స్వీకరించాలని సూచించారు. అభ్యంతరాల స్వీకరణ ఈనెల 7వ తేదీ వరకు ప్రభుత్వం సమయం పెంచినట్లు తెలియజేశారు. అధికారులు ఈ నెల 11న తారీకు లోపు జాబితాను వెరిఫై చేసుకుని ఉన్నత అధికారులకు అందించాలని ఉన్నత అధికారులు ఈనెల 17వ తారీకున పూర్తి జాబితా విడుదల చేయటం జరుగుతుందని వివరించారు. ఈవోపీఆర్డీ భార్గవ్, పరిపాలన అధికారి వి.ప్రతాపరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సర్దుబాటు చార్జీలు వెంటనే ఉపసంహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం సరికాదని, పెంచిన సర్దుబాటు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఉండవల్లిలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశానికి రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. రామారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచమని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.15 వేల కోట్లు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయడం సరికాదని అన్నారు. రోడ్ల విస్తరణ పేరుతో రాజధాని గ్రామాల్లో వందలాది పేదల ఇల్లు తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇల్లు తొలగించకుండా రోడ్డు నిర్మాణాలు చేపట్టాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తోందని, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడకరర్‌ను ఉద్దేశ్యపూర్వకంగానే అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారని, హోం శాఖ మంత్రిగా అమిత్ షా కొనసాగే అర్హత లేదని అన్నారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, రాజధాని డివిజన్ నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, టి.బక్కిరెడ్డి, ఎస్.ఇమ్మానియేల్ రాజు, పేరం బాబూరావు, కుంభ ఆంజనేయులు, బి.చెంచయ్య, ఎస్‌కె జానీ, జి.నాగేశ్వరరావు, అత్తలూరి వీర వెంకయ్య పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన యువకులపై కేసు

తెనాలి రూరల్: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకులపై కేసు నమోదైంది.వివరిలిలా ఉన్నాయి. తెనాలి వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అర్ధ రాత్రి దాటాక రౌండ్స్‌కి తిరుగుతున్న సందర్భంలో రామలింగేశ్వరపేట పాత డిపో సెంటర్ వద్ద నలుగురు యువకులు మద్యం తాగి హల్‌చల్ చేస్తున్నారు. అదే సమయంలో పోలీసులు వెళ్ళగా వారితో ఘర్షణకు దిగి వాహనాన్ని అడ్డుకున్నారు.ఈ నేపథ్యంలో నలుగురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: గర్భిణులు సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలుగుతారని బఫర్ వైద్యురాలు శాంతి అన్నారు. మండలంలోని రేపూడి గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. 95మందికి షుగర్, బీపీ, థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, ఏఎన్‌ఎంలు వెళంగిణీ రాణి, శివకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.